శాకంబరి అలంకారంలో అమ్మవారు


శాకంబరిగా అమ్మవారు

గౌతంనగర్: ఆషాఢమాసాన్ని పురస్కరించుకుని గౌతంనగర్ డివిజన్ గోపాల్‌నగర్‌లోని వరసిద్ధి వినాయక దేవాలయంలోని అమ్మవారిని శాకంబరీగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయసాధనకు కృషి చేయాలి


అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న నేతలు

కుషాయిగూడ: అంబేడ్కర్ ఆశయసాధనకు కృషి చేయాలని పలువురు నేతలు అన్నారు. ఆల్ ఇండియా ఎస్సీ, ఎస్టీ, హక్కుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ఆదివారం ఈసీఐఎల్ చౌరస్తాలో వందోవారం జ్ఞానమాల వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ పాటుపడి హక్కులను సాధించుకోవాలన్నారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షురాలు ఎం. శ్రీదేవి, హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు నాగేశ్వరరావు, సెక్రటరి ప్రభుదాస్, సుధీర్, శారదాబాయ్, కరుణానిధి, శ్రీనివాస్, మురహరి దేవేందర్, యాదగిరి, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణం నరక ప్రాయం

గ్రేటర్ శివారు పట్టణాలు, గ్రామాల్లో పరిస్థితి అధ్వానం

- వర్షాలతో ఛిద్రమైన రోడ్లు
- అస్తవ్యస్తంగా డ్రైనేజీ, పారిశుద్ధ్య వ్యవస్థ
- పట్టని పట్టణ ప్రగతి.. ఇబ్బందుల్లో ప్రజలు
- రూ. లక్షల్లో పన్నులు వసూలైనా ముందుకు సాగని అభివృద్ధి పనులు


జవహర్‌నగర్‌లో..

సాక్షి, సిటీబ్యూరో: భారీ వర్షాలతో నగర శివారు పురపాలికలు.. పంచాయతీల్లో రోడ్లు గుంతల మయం కాగా, లోతట్టు కాలనీలు, మురికివాడలు జలమయమవుతున్నాయి. పలు చోట్ల డ్రైనేజీలు కాలువలు కూడా దెబ్బతిన్నాయి. ఎప్పుడైనా చిన్న పాటి వర్ష పడితే చాలు రోడ్లన్నీ చిత్తడవుతుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఎక్కడ చూసినా గుంతలే..

బోడుప్పల్, జవహర్‌నగర్, పీర్జాదిగూడ, దమ్మాయిగూడ, ఘట్‌కేసర్, పోచారం పురపాలక సంఘాల పరిధిలోని పలు రహదారులు జలమయం కాగా, రోడ్లన్నీ గుంతలు మారి రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. గతంలో కురిసిన భారీ వర్షాలకు బోడుప్పల్, పీర్జాదిగూడ పురపాలక సంఘాల్లోని తొమ్మిది కిలో మీటర్ల రోడ్డు పూర్తిగా దెబ్బతినగా... డ్రైనేజీ కాలువలతో సహా రోడ్ల పనులకు ప్రభుత్వం రూ. 110 కోట్లు విడుదల చేసింది. అయితే పనులు పూర్తికాకపోవడంతో రోడ్లు ఛిద్రంగా మారి స్థానిక ప్రజలు, వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. పలు పురపాలక సంఘాల్లోని రోడ్లల్లో వరద నీరు చేరటంతో నడిచేందుకు వీలు లేక ప్రజలు అవస్థలు పడుతున్నారు.

◆ ఉప్పల్ నుంచి వరంగల్ జాతీయ రహదారిలో ఫ్లైఓవర్ బ్రిడ్జి పనుల్లో జాప్యం కారణంగా వరద నీరు రోడ్డుపై నిలిచితుండటంతో గంటల తరబడి రాకపోకలు స్తంభిస్తున్నాయి. దీంతో వాహన చోదకులు, ప్రయాణికులు ,స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

◆ నాగారం నుంచి కీసర ప్రధాన రోడ్డులో వరద నీటి కారణంగా వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. వార్డుల్లోని పలు గ్రామ పంచాయతీల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది.

చెరువుల కబ్జాలతో రోడ్డెక్కిన నీళ్లు..

నగర శివారు చెరువు, కుంటలు, శిఖాలు, నాలాల స్థలాల కబ్జాలతో చిన్నపాటి వర్షాలకు సమీపంలోని కాలనీలు, లో తట్టు ప్రాంతాలను వరద ముంచెత్తుతోంది. చెరువులు,నాలాల్లో అక్రమ కట్టడాల వల్ల నాగారం, దమ్మాయిగూడ, జవహర్‌నగర్., బోడుప్పల్, పీర్జాదిగూడ, బడంగ్‌పేట్ పురపాలక సంఘాల్లో పలు కాలనీలు, చెంగిచర్లలోని బస్సు డిపో సమీపంలో ఉన్న చెరువు కట్ట ధ్వంసం చేసి బహుళ అంతస్తుల భవనాన్ని నిర్మించటంతో సమీపంలోని కాలనీల్లోకి వరద నీరు వచ్చి చేరుతుండటంతో ఆయా ప్రాంతాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

శివారు పురపాలికల్లో....

నగర శివారుల్లో బోడుప్పల్, పీర్జాదిగూడ నిజాంపేట్, జవహర్‌నగర్, బడంగ్‌పేట్, మీర్‌పేట్, బండ్లగూడ నగర పాలక సంస్థలు ఉండగా, దమ్మాయిగూడ, నాగారం, పోచారం, ఘట్‌కేసర్ , గుండ్లపోచంపల్లి, తూముకుంట, కొంపల్లి, దుండిగల్, మేడ్చల్, పెద్ద అంబర్‌పేట్, తుక్కుగూడ, ఇబ్రహీంపట్నం, జల్‌పల్లి, షాద్‌నగర్, శంషాబాద్, శంకర్‌పల్లి, తుర్కయాంజాల్, మణికొండ, నార్సింగ్, ఆదిభట్ల, అమనగల్లు మున్సిపాలిటీలు ఉన్నాయి. ఆయా పట్టణాల్లో ఏటా వివిధ పన్నుల రూపేణా రూ. 343 కోట్లు వసూలు చేస్తున్నా ప్రజలకు సేవలు అందించడంలో పాలకులు విఫలమయ్యారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.


పీర్జాదిగూడలో..


జవహర్‌నగర్‌లో..


ఘట్‌కేసర్‌లో..

ఆదాయం ఉన్నా..అభివృద్ధి సున్నా..

శివారు మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 13 పురపాలక సంఘాల నుంచి పన్నుల ద్వారా రూ. 175 కోట్లు వస్తుండగా, రంగారెడ్డి జిల్లాలో 16 పురపాలక సంఘాల నుంచి రూ. 168 కోట్లు వసూలవుతున్నాయి. 15వ ఆర్థిక సంఘం ద్వారా కూడా ప్రతి నెల ఒక్కో పురపాలక సంఘానికి రూ. 3 లక్షల నుంచి రూ. 21 లక్షల నిధులు విడుదలవుతున్నాయి. పట్టణ ప్రగతితో పాటు పురపాలక సంఘాలకు ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తోంది. ఈ నిధులను ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి పనులకు వెచ్చించాల్సి ఉన్నా అధికారులు పట్టించుకోకపోవటంతో అభివృద్ధి అంతంత మాత్రంగానే సాగుతోంది.

ఎక్కడి సమస్యలు అక్కడే..

పురపాలక సంఘాల్లో ఎక్కడ సమస్యలు అక్కడనే మూలుగుతున్నాయి. ఇటీవల కురుస్తున్న వర్షాలతో లోతట్టు కాలనీ వాసులు, ప్రజలు నానా ఆగచాట్లకు గురవుతున్నారు. చెత్తాచెదారం, డ్రైనేజీ, పారిశుద్ధ్య సమస్యలతో ప్రజలు అల్లాడుతున్నారు. గ్రామానికి తక్కువ, పట్టణానికి ఎక్కువ అనే రీతిలో పురపాలక సంఘాల్లో అభివృద్ధి సాగుతోంది. మూసీ నదిలో మురుగునీటి ప్రవాహం వల్ల దోమలు అధికం అవుతున్నాయి. పలు పురపాలికల్లో రోడ్లపై పారుతున్న మురికి, వరద నీటికితోడు సైడు కాలువలు లేని దుస్థితి దోమలకు కేంద్రంగా మారుతోంది.

మహంకాళి అమ్మవారికి కార్పొరేటర్ పూజలు


మహంకాళి అమ్మవారి సన్నిధిలో కార్పొరేటర్ రాజ్యలక్ష్మి

మౌలాలి: సికింద్రాబాద్‌లోని ఉజ్జయిని మహంకాళి ఆలయంలో ఆదివారం మహంకాళి అమ్మవారిని డివిజన్ నాయకులతో కలిసి వినాయక్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ రాజ్యలక్ష్మీ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో సాయి సురేష్, గోపాల్, శ్రీకాంత్ యాదవ్, మహేష్, నరేందర్, శివ, సాయి పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో సత్యనారాయణ వ్రతం



మల్కాజిగిరి: ఆషాఢ పౌర్ణమి సందర్భంగా ఆనంద్‌బాగ్‌లోని షిరిడీసాయిబాబా దేవాలయ ఆవరణలో ఆదివారం సత్యనారాయణ స్వామి వత్రం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు.

గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

మల్లాపూర్: గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన నాచారం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ మహబూబ్‌వలీ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. నాచారం కల్యాణి మోటార్స్ సమీపంలోని చెట్టుకు గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్లు గుర్తించిన స్థానికులు డయల్ 100 కి కాల్‌చేసి సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని కిందకు దించి చూడగా అతని కుడి చేతి మణికట్టుపై హిందీలో ఓం చిహ్నం , ఎడమ చేతిపై రాడే జోష్, త్రిశూల్, ఢమరుకం చిహ్నాలు ఉన్నాయి. మృతుడి వివరాలు తెలియరాలేదు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

భక్తులకు ఇబ్బంది లేకుండా చూడాలి


క్రాంతి కాలనీ సూచిక బోర్డు ఏర్పాటు చేసిన కాలనీ వాసులు

మేడిపల్లి: పీర్జాదిగూడలో ఆగస్టు 4న బోనాల ఉత్సవాలను నిర్వహించనున్న నేపథ్యంలో ఆదివారం మేడిపల్లి క్రాంతి కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో కాలనీ వాసుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ.. బోనాల జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం క్రాంతి కాలనీ మెయిన్ రోడ్డు వద్ద కాలనీ సూచిక బోర్డును ఏర్పాటు చేసినట్లు సభ్యులు తెలిపారు. సమావేశంలో కాలనీ అధ్యక్షుడు కత్తుల ముత్యాలు, జనరల్ సెక్రెటరి సంతోష్ గౌడ్, పాలకుర్తి శేశగిరి రావు, మనోజ్, వెంకటరమణ, నర్సిహ, వినోద్, అల్లూరయ్య, వెంకటేష్, పిచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో పండుగలు జరుపుకోవాలి


ఘటాల ఊరేగింపులో పాల్గొన్న మేయర్

బోడుప్పల్: బోనాలను ప్రశాంతమైన వాతావరణంలో జరుపుకోవాలని బోడుప్పల్ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ అన్నారు. మాజీ ఎంపీటీసీ సభ్యులు దేవరకొండ వీరాచారి ఆధ్వర్యంలో ఆదివారం బోడుప్పల్‌లో నిర్వహించిన బోనాల ఘటాల ఊరేగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా బోనాలు నిలుస్తాయన్నారు. రానున్న ఆదివారం బోడుప్పల్‌లో పెద్ద ఎత్తున బోనాల ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్య క్రమంలో కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్‌యాదవ్, బోడుప్పల్ అధ్యక్షులు పోగుల నర్సింహారెడ్డి, ఫెడరేషన్ చైర్మన్ రాపోలు రాములు, కార్పొరేటర్లు చీరాల నర్సింహ్మా, భూక్యా సుమన్‌నాయక్, నేతలు గుర్రాల వెంకటేశ్‌యాదవ్, దానగల్ల యాదగిరి పాల్గొన్నారు.

లోతట్టు ప్రాంతాల్లో కాంగ్రెస్ అధ్యక్షుడి పర్యటన


లోతట్టు ప్రాంతాల్లో పర్యటిస్తున్న తుంగతుర్తి రవి

మేడిపల్లి: రెండు రోజులగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో పీర్జాదిగూడ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తుంగతుర్తి రవి ఆదివారం కార్పొరేషన్ పరిధిలోని లోతట్టు ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా వర్షాల కారణంగా ప్రజలు ఎదుర్కొటున్న సమస్యలు తెలుసుకుని సంబంధిత అధికారులతో మాట్లాడారు. విద్యుత్, డ్రైనేజీ సమస్యలను పరిష్కరించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో యాసారం నగేష్ తదితరులు పాల్గొన్నారు.

28న మల్లాపూర్‌లో బోనాల పండుగ

మల్లాపూర్: ఈ నెల 28న మల్లాపూర్‌లో ఆషాఢ మాసం బోనాలు నిర్వహించనున్నట్లు మల్లాపూర్ గ్రామ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఆదివారం ఓల్డ్ మల్లాపూర్‌లో బోనాల ఉత్సవాలపై గ్రామ కమిటీ, అనుబంధ కాలనీల సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లాపూర్, పరిసర కాలనీల్లో ఒకే సారి బోనాలు నిర్వహించాలని నిర్ణయించారు. బోనాల పండుగను శాంతియుతంగా జరుపుకోవాలని కోరారు.

ఘనంగా విగ్రహా ప్రతిష్ఠాపన

ఉప్పల్: ఉప్పల్ ఓల్డ్ భరత్‌నగర్‌లోని భూలక్ష్మీ అమ్మవారి దేవాలయంలో ఆదివారం విగ్రహప్రతిష్ఠాపన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్ చార్జి మందుముల పరమేశ్వర్‌రె అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామ దేవతలు గ్రామాలను కాపాడుతారని ప్రజల నమ్మకమని, అమ్మవారి ఆశీస్సులతో అందరూ సుఖ సంతోషాలతో మెలగాలని కోరారు. కార్యక్రమంలో ముత్యంగారి బీరప్ప రవి, శ్రీనివాస్, భాస్కర్, జగన్ తదితరులు పాల్గొన్నారు.

పోరాటం ఉధృతం చేయాలి


సీపీఎం విస్తృతస్థాయి సమావేశంలో పాల్గొన్న నేతలు

కాప్రా: బీజేపీని బలహీనపర్చాలన్నా, ఓడించాలన్న ఉధృతమైన పోరాటాలతోనే సాధ్యమని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు వెంకట్ అన్నారు. ఆదివారం ఏఎస్‌రావునగర్ డివిజన్ కమలానగర్‌లోని జిల్లా పార్టీ కార్యాలయంలో సీపీఎం జిల్లా విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వెంకట్ మాట్లాడుతూ.. కేంద్రంలో బీజేపీ మూడోసారి అధికారంలోకి రావడానికి రాజ్యాంగ, ప్రభుత్వ సంస్థలను తనకు అనుకూలంగా మార్చుకుందన్నారు. ఈడీ, సీబీఐని వాడుకుంటూ ప్రశ్నించిన వారిని జైళ్లలో పెట్టిస్తున్నారని, ఎన్నికల సంఘం కూడా బీజేపీకి వంతపాడుతుందని ఆరోపించారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఇండియా కూటమి బలం బాగా పెరిగిందని, కేజ్రీవాల్ జైల్లో కాకుండా బయట ఉండి ఉంటే ఫలితాలు మరోలా ఉండేవన్నారు. తెలంగాణలో బీజేపీ బలం పెరగడం ప్రమాదకరమన్నారు.

కాంగ్రెస్ హామీలు అమలు చేయాలి

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు పూర్తి స్థాయిలో అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి సత్యం డిమాండ్ చేశారు. ఆరు గ్యారంటీల్లో ఉచిత బస్సు మాత్రమే సంపూర్ణంగా అమలులోకి వచ్చిందని విద్యుత్, గ్యాస్ తదితర హామీలు పూర్తి స్థాయిలో అమలు కావడంలేదన్నారు. అర్హులందరికీ రుణమాఫీ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో సీపీఎం ప్రతిపక్ష పాత్ర పోషించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ నేతలు రవి, వినోదం, అశోక్, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా విఠోబా


నియామకపత్రాన్ని అందుకుంటున్న విఠోబా

మల్కాజిగిరి: మల్కాజిగిరికి చెందిన సీనియర్ బీజేపీ నాయకుడు చింతకుంట విఠోబా ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా నియమితులయ్యారు. ఈ మేరకు ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్ ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. విఠోబా మాట్లాడుతూ ఓబీసీ విభాగాన్ని బలోపేతం చేసేందుకు తన వంతు కృషి చేస్తానని, పదవి రావడానికి సహకరించి అందరికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నానన్నారు.

ఘనంగా బోనాల వేడుక


గాంధీనగర్‌లో అమ్మవారికి బోనాలు సమర్పిస్తున్న మహిళలు

కాప్రా: ఆషాఢ మాస బోనాల ఉత్సవాలను ఆదివారం కాప్రా డివిజన్ గాంధీనగర్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీలోని మైసమ్మ, పోచమ్మ, విజయదుర్గమ్మ అమ్మవార్ల ఆలయాలకు భక్తులు క్యూ కట్టారు. అమ్మవార్లకు బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఉత్సవాలకు సహకారం అందించిన దాతలను కాలనీ వాసులు సన్మానించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు మహేష్, బాలయ్య, కిష్టయ్య, నర్సింగారావు, సత్యనారాయణ, దశరథ్, ఇంద్రయ్య, బాబురావ్, రాజేష్, మల్లారెడ్డి, విఠల్ నాయక్, సంతోష్‌చారి, బాబన్న, శ్రీహరి, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న డబుల్ బెడ్ రూం ఇళ్ల లబ్ధిదారులు

తాగునీటి వసతి కల్పించాలి

బోడుప్పల్: డబుల్ బెడ్ రూం ఇళ్లకు తాగు నీటి సౌకర్యం కల్పించాలని కోరుతూ లబ్ధిదారులు ఆదివారం 13వ డివిజన్ కార్పొరేటర్ దానగల్ల అనిత యాదగిరి ఆధ్వర్యంలో మేయర్ తోటకూర అజయ్‌యాదవ్, డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతి గౌడ్‌లను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాటర్ సంపు నిర్మాణం పూర్తయ్యిందని, ఇళ్లపై వాటర్ ట్యాంక్‌లు ఏర్పాటు చేసి నీటిని సరఫరా చేయాలని కోరారు. అందుకు వారు సానుకూలంగా స్పందించి కౌన్సిల్‌లో తీర్మానం చేసి పనులు చేపడతామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. మేయర్, డిప్యూటీ మేయర్‌ను కలిసిన వారిలో 13వ డివిజన్ అధ్యక్షులు గోపు రాం, లబ్ధిదారులు పాల్గొన్నారు.


అల్వాల్ జొన్నబండ సాయిబాబా దేవాలయంలో..


రామ్‌నగర్ కాలనీలో..

ఘనంగా గురుపౌర్ణమి వేడుకలు

గురుపౌర్ణమి వేడుకలు ఆదివారం మల్కాజిగిరి, ఉప్పల్ నియోజకవర్గాల పరిధిలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పలు కాలనీలు, బస్తీల్లోని ఆలయాలను ప్రత్యేకంగా అలంకరించారు. ఆయా ప్రాంతాల్లో ప్రత్యేక పూజలు, అన్నదానాలు, వ్రతాలు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై పూజలు చేశారు.

– మల్కాజిగిరి, ఉప్పల్ జోన్ బృందం



వృద్ధాశ్రమంలో అన్నదానం చేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు


ప్రత్యేక అలంకరణలో షిరిడీసాయిబాబా, దత్తాత్రేయ స్వామి

గురువు దైవంతో సమానం

రామంతాపూర్: గురువు దైవంతో సమానమని కార్పొరేటర్లు కక్కిరేణి చేతన హరీష్, బండారు శ్రీవాణి వెంకట్‌రావు అన్నారు. ఆదివారం వెంకట్‌రెడ్డినగర్‌లోని శ్రీ సాయిబాబా మందిరంలో నిర్వహించిన గురు పౌర్ణమి వేడుకల్లో పాల్గొన్న వారు ఆలయ చైర్మన్ గంజి రాజమౌళి గుప్తా, అధ్యక్షుడు మహాదేవ భట్ల లక్ష్మణ్ ప్రసాద్ శర్మతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అజ్ఞానంలో ఉన్న వారిలో జ్ఞాన జ్యోతిని వెలిగించి సన్మార్గంలో నడిపించే గురువు దైవంతో సమానమన్నారు. బోనగిరి శ్రీనివాసులు గుప్త, దుక్కిడి నాగేశ్వర్‌రావు, యాదయ్య, పారుపల్లి హనుమంతరావు, గడ్డం సాయి కిరణ్, రాగిడి వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.


గురు పౌర్ణిమ వేడుకల్లో పాల్గొన్న కార్పొరేటర్లు

గురువు స్థానం పవిత్రం: కోదండరామ్

సంస్కృతి టౌన్‌షిప్‌లో ఘనంగా గురుపౌర్ణమి



పోచారం: మున్సిపాలిటీ పరిధిలోని సంస్కృతి టౌన్‌షిప్‌లో గురుపౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. టౌన్‌షిప్ ఫ్లాట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు బెజ్జంకి హరిప్రసాదరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో ముఖ్య అతిథులుగా తెలంగాణ ఉద్యమ నాయకుడు కోదండరామ్, మాజీ ఎమ్మెల్సీ సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... సమాజంలో గురువులకు ఉన్న స్థానం ఎంతో పవిత్రమైనదన్నారు. సంప్రదాయబద్ధంగా గురుపూజోత్సవాన్ని జరుపుకోవడం శుభప్రదమన్నారు. అనంతరం బేరెడ్డి రాధారెడ్డి సౌజన్యంతో అన్నదానం చేశారు. కార్యక్రమంలో గురువులతో పాటు కాలనీవాసులు పాల్గొన్నారు.